సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 14 । అక్టోబర్ । 2023



జయప్రదం చేయాలి..
భద్రాచలం రామాలయంలో జరిగే శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఈఓ రమాదేవి కోరారు. IVలో



కుదరని సయోధ్య!
ఇల్లెందు గులాబీ శ్రేణుల్లో అసమ్మతి ఎటూ చల్లారడం లేదు. పార్టీ పెద్దలు సర్దిచెబుతున్నా శాంతించడంలేదు. IIలో

గరిష్టం / కనిష్టం
33° / 23°

వాతావరణం
జిల్లాలో శనివారం కొద్దిమేర ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. ఆకాశం మేఘావృతమై ఉక్కపోత వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలతో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలోని మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారికి అభిషేకం జరిపారు.

జనావాసాల్లోకి కొండ గొర్రె..



కొండగొర్రె పిల్లను అందజేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ

టేకులపల్లి: జనావాసాల్లోకి కొండగొర్రె పిల్ల వచ్చిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆంజనేయపాలెం గ్రామంలోకి సమీప అటవీ ప్రాంతం నుంచి కొండగొర్రె పిల్ల వచ్చింది. గ్రామానికి చెందిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ దంపతులు, గ్రామస్తులు దానిని అటవీశాఖ అధికారులు ముఖ్తార్ హుస్సేన్, శ్రీను, నగేశ్‌కు అప్పగించారు. అధికారులు కిన్నెరసాని డీర్ పార్కులో కొండగొర్రె పిల్లను అప్పగించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ స్టడీ సర్కిల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనుండగా, దరఖాస్తు గడువును ఈనెల 18వరకు పొడిగించినట్లు డైరెక్టర్ జి.శ్రీలత తెలిపారు. టీఆర్‌టీ రాసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08742-227427లో సంప్రదించాలని సూచించారు.

‘హస్తం’లో ఐక్యత

కొత్తగూడెం, భద్రాచలం వదులుకోవద్దని పట్టు

- కమ్యూనిస్టులకే ఇస్తారనే ప్రచారంతో కలిసిన గ్రూపులు
- అభ్యర్థి ఎవరైనా పార్టీని గెలిపిస్తామని హామీ
- ఎన్నికల పొత్తు ప్రయత్నాల్లో కాంగ్రెస్‌లో కొత్త చిక్కులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: జిల్లాలోని కీలక స్థానాలను కమ్యూనిస్టులకు కేటాయిస్తారనే ప్రచారంతో కాంగ్రెస్‌లో వివిధ వర్గాల నేతలు ఒక్క తాటిపైకి వస్తున్నారు. పార్టీలో ఎన్ని వర్గాలు ఉన్నా హస్తం గుర్తుపై పోటీ చేసే అభ్యర్థి గెలుపు కోసం కలిసికట్టుగా పని చేస్తామంటూ హైకమాండ్‌కు తేల్చి చెబుతున్నారు.

సర్దుకుపోవాలంటూ పార్టీ నేతల సూచన

జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల పోరులో కలిసి నడవాలని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు నిర్ణయించాయి. ఈ మేరకు ఇటు అసెంబ్లీ, అటు పార్లమెంటు ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని పోటీ చేయాలనే ప్రాథమిక అవగాహనకు జాతీయ నాయకత్వం వచ్చింది. సీపీఐ, సీపీఎంలు చెరో ఐదు అసెంబ్లీ స్థానాలు తమకు కేటాయించాలని అడుగుతున్నట్టు సమాచారం. కాంగ్రెస్ ఒక్కో స్థానం ఇచ్చేందుకు రెడీగా ఉన్నట్టు ప్రచారం జరిగింది. చివరకు ఉభయ కమ్యూనిస్టులకు చెరో స్థానం ఇచ్చేలా ఒప్పందం కుదిరిందనే ప్రచారం జోరందుకుంది. అందులో భద్రాచలం సీపీఎం, కొత్తగూడెం సీపీఐకి కేటాయిస్తారంటూ వార్తలు గుప్పుమన్నాయి. దేశవ్యాప్త రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా సర్దుకుపోవాలంటూ పార్టీ పెద్దలు అనధికారికంగా టికెట్ ఆశిస్తున్న నేతలకు సమాచారం అందించారు.

గూడెం నుంచి పది మంది ఆశావహులు..

కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పది మంది ఆశావహులు గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇలా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పార్టీ తరపున కనీసం మాట్లాడిన వారు కరువయ్యారు. దీంతో లక్కినేని సురేందర్ వంటి వారు దరఖాస్తు చేసుకుని కూడా హస్తానికి గుడ్‌పై చెప్పి బీజేపీ కండువా కప్పుకున్నారు. బీసీలకే టికెట్ ఇవ్వాలంటూ ఎడవల్లి కృష్ణ, నాగా సీతారాములు, పోట్ల నాగేశ్వరరావులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇక టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం కొత్తగూడెం నుంచి పోటీకి సుముఖంగా ఉన్నారు. మొత్తంగా కాంగ్రెస్ నుంచి ఈ ముగ్గురి పేర్లు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. ఎవరికి వారుగా గాంధీభవన్, ఢిల్లీ స్థాయిల్లో తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటూ వస్తున్నారు.

కొత్తగూడేన్ని వదలొద్దు

సాధారణంగా కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపు రాజకీయాలకు, వర్గపోరుకు పెట్టింది పేరు. జిల్లాలోనే భట్టి విక్రమార్క, రేణుకా చౌదరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రేవంత్‌రెడ్డి వర్గాలుగా నాయకులు చీలిపోయి ఉన్నారు. గడిచిన ఏడాది కాలంగా తమ గ్రూపు ప్రయోజనాలే పరమావధిగా పని చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి మూడుకు పైగా కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. పార్టీ పరంగా ఏ పిలుపు ఇచ్చినా ఎవరికి వారుగా కార్యక్రమాలు చేసుకుంటూ వచ్చారు. అయితే కమ్యూనిస్టులకు సీటు పోతుందనే ప్రచారం జరగడంతో తమ మధ్యన ఉన్న విభేదాలను నేతలంతా పక్కన పెట్టడం ఇప్పుడు విశేషంగా మారింది. పొత్తుల్లో కొత్తగూడేన్ని కాంగ్రెస్ వదులుకోవద్దనేది వారందరి ఏకైక డిమాండ్‌గా మారింది.

మూడు రోజులుగా రాజధానిలోనే పొదెం

సీపీఎంకు భద్రాచలం సీటు ఇస్తారనే ప్రచారంపై సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే ఈ ప్రచారం మొదలైన వెంటనే పొదెం హైదరాబాద్‌కు చేరుకుని గడిచిన మూడు రోజులుగా అక్కడే మకాం వేశారు. మరోవైపు స్థానిక కాంగ్రెస్ నేతలు భద్రాచలాన్ని కమ్యూనిస్టులకు కేటాయించవద్దంటూ పార్టీ పెద్దలను కోరుతూ మీడియా సమావేశాలు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీలోని గ్రూపులంతా ఒక్కతాటిపై వచ్చి వినిపిస్తున్న ఐక్యతారాగాన్ని ఆ పార్టీ హై కమాండ్ ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

హస్తం గుర్తును గెలిపిస్తాం

కొత్తగూడెం స్థానంపై కాంగ్రెస్ నేతల్లో ఓ వైపు తీవ్ర పోటీ నెలకొని ఉండగా మరోవైపు ఈ సీటును కమ్యూనిస్టులకు కేటాయించడం ఖాయమనే ప్రచారం ఊపందుకుంది. దీంతో ఇటు నేతలతో పాటు పార్టీ కేడర్‌లోనూ గందరగోళం నెలకొంది. దీంతో కాంగ్రెస్‌లో మూడు వర్గాలను చెందిన నేతలంతా ఒక్క తాటిపైకి వచ్చారు. కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా తామంతా అతని గెలుపు కోసం పని చేస్తామంటూ ఒకే వేదిక మీదుగా పార్టీ పెద్దలకు, క్షేత్రస్థాయిలో కేడర్‌కు సందేశం పంపిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి ఎవరనేది కాకుండా బ్యాలెట్ పేపర్‌లో హస్తం గుర్తు ఉండటమే తమకు ప్రధానమని, ఆ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థిని గెలిపించి సోనియాకు బహుమతిగా ఇస్తామంటూ ఐక్యతా రాగం వినిపిస్తున్నారు.

పాండురంగాపురం వాసికి డాక్టరేట్



ఆదూరి ప్రకాశ్‌రెడ్డి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన ఆదూరి ప్రకాశ్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నాడు. తల్లిదండ్రులు ఇన్నారెడ్డి, విజయలక్ష్మి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ ఉన్నత చదువులు చదివించగా పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఇతను కొత్తగూడెంలోని ధన్వంతరి ఫార్మసీ కళాశాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఫార్మసీ విభాగంలో డాక్టర్ పి.షణ్ముగసుందరం పర్యవేక్షణలో కేన్సర్ సంబంధిత పరిశోధనలపై సిద్ధాంత గ్రంథం సమర్పించగా, చెన్నైలోని వెల్స్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఇద్దరు డిగ్రీ కళాశాల అధ్యాపకులకు..

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న నండూరి రాంబాబుకు రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. డాక్టర్ గజ్జా యోహాను బాబు పర్యవేక్షణలో ''సంఘ సంస్కరణలు–గురజాడ ప్రభావం''అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించగా డాక్టరేట్ ప్రదానం చేశారు. కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న తలారి వెంకటేశ్వరరావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇద్దరు అధ్యాపకులను శుక్రవారం కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భద్రయ్య తదితరులు సన్మానించారు.

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ

- సీఎం కేసీఆర్‌తో అందరికీ సంక్షేమ ఫలాలు
- 70 వేల మందితో ఇల్లెందులో బహిరంగ సభ
- మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, రవిచంద్ర



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన ఎంపీలు కవిత, రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఇల్లెందు: సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే హరిప్రియ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో 63 సీట్లతో, 2018లో 88 సీట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రతీ ఇంటికి అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందేలా పాలన సాగించారని గుర్తు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు 50 రోజుల ముందే అభ్యర్థులను ప్రకటించారని పేర్కొన్నారు. ఈ నెల 30న ఇల్లెందులో సీఎం సభ నిర్వహిస్తామని, అన్ని గ్రామాల నుంచి సభకు ప్రజలను తరలించాలని కార్యకర్తలకు సూచించారు. ఇల్లెందు నియోజకవర్గంలో 2 లక్షల ఓటర్లు ఉంటే సుమారు లక్షా 20 వేల మంది సంక్షేమ ఫలాలు పొందిన వారే ఉన్నారని తెలిపారు. 18 వేల కుటుంబాలు పోడు పట్టాలు పొందాయని అన్నారు. ఇల్లెందు నియోజక వర్గానికి సీతమ్మ సాగర్ ద్వారా గోదావరి జలాలు అందిస్తామని తెలిపారు. ఎన్నికలప్పుడు టూరిస్టులు వస్తుంటారని, వారి మాటలు నమ్మొద్దని చెప్పారు. ఎమ్మెల్యేగా ఓడిపోయాక జెడ్పీ చైర్మన్ పదవి ఇచ్చినా పార్టీని వీడటం కోరం కనకయ్యకే చెల్లిందన్నారు. రాష్ట్రంలో 11 సార్లు కాంగ్రెస్‌కు అధికారం లభించిందని, అయినా ఒక్కసారి అవకాశం ఇవ్వండంటూ అడగటం విడ్డూరంగా ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్‌రెడ్డి అప్పుడే సీఎం అయిపోయినట్లు వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ 10 ఏళ్ల అధికారంలో ఉండి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేదని విమర్శించారు.

వరుస భేటీలు..

అసెంబ్లీ ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఇల్లెందు రానున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు మంత్రి సత్యవతి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇల్లెందు టౌన్, మండలం, గార్ల, బయ్యారం, కామేపల్లి, టేకులపల్లి మండలాల నేతలు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.విభేదాలు పక్కన పెట్టి వర్గాలకు అతీతంగా కలిసికట్టుగా ముందుకు సాగుదామని హితబోధ చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మహబూబాబాద్ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, మూడ్ కృష్ణప్రసాద్, ఉమ, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల అవస్థ

- బస్సుల కోసం బస్టాండ్లలో పడిగాపులు
- సెలవుల రద్దీ వేళ పట్టించుకోని అధికారులు



కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ..

చుంచుపల్లి: బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించిన అధికారులు సర్వీసులను సక్రమంగా తిప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటించింది. దీంతో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల తాకిడి ఆర్టీసీలో ఒక్కసారిగా పెరిగింది. కొత్తగూడెం, పాల్వంచ బస్టాండ్ ప్రాంగణాలు రద్దీగా మారాయి. మిట్ట మధ్యాహ్నం వేళ ప్రధాన బస్టాండ్లలో బస్సులు లేక ప్రయాణికులు గంటల కొద్దీ వేచి చూడాల్సివచ్చింది. ముఖ్యంగా కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్లే ప్రయాణికులకు తగిన సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంచలేదు. అరకొరగా వచ్చిపోయే బస్సులే ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించాయి. కొందరు ఫుట్ బోర్డులపై ప్రయాణం చేస్తూ కనిపించారు. పండుగల నేపథ్యంలో జిల్లాలో 304 బస్సులు పది రోజులపాటు వివిధ రూట్లలో తిప్పనున్నట్లు ప్రకటించారు. అయితే సాధారణ రూట్లకు సర్వీసులు తగ్గించి, పండుగ కోసం ప్రత్యేకంగా తిప్పుతున్నారని ప్రయాణికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతి ఇల్లూ పూల పరిమళమే..

- నేడు ఎంగిలి పూల బతుకమ్మతో ఉత్సవాలు షురూ..
- తొమ్మిది రోజులపాటు ఊరూవాడ సందడే సందడి
- చెరువు గట్లు, ఆలయాల వద్ద వేడుకలకు ఏర్పాట్లు
- ఈ నెల 22న సద్దుల పండుగతో ముగియనున్న వేడుకలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక.. ఆడపడచుల వేడుక.. పూల సంబరం బతుకమ్మ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు పల్లెలన్నీ పూల సింగిడిలా మారనున్నాయి. బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..తదితర జానపద గీతాలతో గ్రామాలు హోరెత్తనున్నాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరమ్మను పూజించనున్నారు. రోజుకో రకమైన నైవేద్యం సమర్పించనున్నారు.

–పాల్వంచరూరల్/అశ్వాపురం



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

బతుకమ్మ పండుగను తెలంగాణలో మాత్రమే జరుపుకుంటారు. పసుపు, కుంకుమల సౌభాగ్యం, పల్లెగాథల పల్లవి, మెట్టినింటి ముచ్చట్లు, పుట్టింటి పదనిసల కలబోతే పూల జాతరగా పేర్కొనవచ్చు. ప్రకృతి రమణీయతకు, సంస్కృతికి, సంప్రదాయాలకు, భక్తిభావానికి ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో బాలికలు మొదలు వృద్ధుల వరకు మహిళలందరూ ఆనందంగా జరుపుకుంటారు. మహాలయ అమావాస్య(శనివారం) నాడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై 22 తేదీన అశ్వయుజ శుద్ధ అష్టమి ఆదివారం రోజున సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే మహిళలంతా పుట్టిళ్లకు చేరుకున్నారు.

వరుసకో రకమైన పూలు..

రాగి లేదా ఏదైనా పళ్లెంలో గుమ్మడి ఆకులు ఉంచి, ముందు తంగేడు పువ్వును వరుస క్రమంలో పేరుస్తారు. వరుస పూర్తికాగానే మరో వరుసలో గునుగు పూలు, ఇంకో వరుసలో గడ్డిపూలు.. ఇలా గన్నేరు, చామంతి, మందార, గోరింట తదితర రకాలను ఒకదాని తర్వాత మరొకటి చుట్టూ పేర్చి గుడి గోపురంలా తీర్చిదిద్దుతారు. ఆ తర్వాత గుమ్మడి పూవులోని కాడను, ఒక పసుపు ముద్దను గౌరమ్మగా భావించి గోపురంపై పెట్టి ఇంట్లో దేవుని సన్నిధిలో పసుపు, కుంకుమలు చల్లి ఉంచుతారు. ఈ పెద్ద బతుకమ్మతోపాటు మరో చిన్న బతుకమ్మను కూడా పేరుస్తారు. సాయంత్రం వేళలో నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి మేళతాళాలతో సామూహికంగా బతుకమ్మలను చేబూని గ్రామ కూడళ్లకు, చెరువుగట్టు, ఘాట్‌లు, వాగులు, ఆలయాల వద్దకు చేరుకుంటారు. అక్కడ వెంపళి కొమ్మను నాటి దాని చుట్టూ పసుపు, కుంకుమలు చల్లి వరుస క్రమంలో బతుకమ్మలను ఉంచుతారు. అనంతరం వెంట తెచ్చుకున్న విడిపూలను బతుకమ్మలపై ఒక్కొక్కటిగా వేస్తూ జానపద పాటలు పాడుతూ శివుడు, గౌరీదేవిలను వేడుకుంటారు. ఆ క్రమంలోనే మహిళలంతా లయబద్ధంగా చప్పట్లు కొడుతూ, బతుకమ్మల చుట్టూ గుండ్రంగా తిరుగుతుంటారు. ఇలా చీకటి పడేవరకు వేడుకను నిర్వహిస్తారు. అనంతరం బతుకమ్మలను నీళ్లల్లో నిమజ్జనం చేస్తారు. ప్రధానంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ రోజులకు మాత్రమే మహిళలు అధిక ప్రాధాన్యతనిచ్చి పోటీలుపడి పెద్ద ఎత్తున జరుపుకుంటారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...., ఒక్కో పువ్వేసి చందమామ.. ఒక్క జామాయే చందమామ..., కలవారి కోడలు ఉయ్యాలో.. తదితర జానపద గీతాలు ఆలపిస్తూ నృత్యం చేస్తారు.

2014లో రాష్ట్ర పండుగగా బతుకమ్మ..

బతుకమ్మ పండుగకు ఉన్న విశిష్టత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం 2014 జూన్ 16న దీనిని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. పండుగ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులతోపాటు మహిళలకు చీరలను పంపిణీ చేస్తోంది.

■ పూల ప్రత్యేకత.. విభిన్న నైవేద్యాలు..

ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే పూలతో అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే పండుగ బతుకమ్మ. బతుకమ్మ పేర్చే పూలలో పువ్వుపువ్వుకో ప్రత్యేకత ఉంది. తంగేడు పువ్వు పసుపు పచ్చ రంగుతో సకాల శుభాలకు సూచిక. గోరింట పూలు.. ఎర్రగా ఉండి ప్రేమానురాగాలకు ప్రతీక. గునుగుపూలు.. తెలుపు రంగులో ఉండి శాంతికి చిహ్నంగా నిలుస్తాయి. బంతి, చామంతి, తామర, కట్ల, గడ్డి పూలు సప్త వర్ణాలు కలిగి ఉంటాయి. తొమ్మిది రోజులపాటు గౌరీదేవికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారు.

ఎంగిలి పూల బతుకమ్మ: నువ్వులు, బియ్యం పిండితో చేసిన ముద్దలు
అటుకుల బతుకమ్మ : సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు
ముద్దపప్పు బతుకమ్మ: ముద్ద పప్పు, పాలు, బెల్లం
నాన బియ్యం బతుకమ్మ : నానబెట్టిన బియ్యం, నువ్వులు, పాలు, బెల్లం
అట్ల బతుకమ్మ: అట్లను నైవేద్యంగా అందజేస్తారు.
అలిగిన బతుకమ్మ: ఆరో రోజు వేడుకను అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఈ రోజు నైవేద్యం చేయరు.
వేపకాయల బతుకమ్మ : బియ్యం పిండితో వేప పండ్లలా తయారు చేస్తారు.
వెన్నముద్దల బతుకమ్మ : నువ్వులు, నెయ్యి, బెల్లం
సద్దుల బతుకమ్మ : తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగుస్తాయి.

■ పూలసేకరణ..

బతుకమ్మ పేర్చేందుకు అవసరమైన పూలను మహిళలతోపాటు పురుషులు కూడా చెట్టు.. పుట్ట తిరిగి సేకరిస్తారు. ప్రధానంగా అడవిలో లభించే తంగేడు, గునుగు, బంతి, అటవీ చామంతి, నందివర్ధనం, గుమ్మడి, బీర, కట్ల పూలు, గోరింట, కలువ, గన్నేరు తదితర పూలతో బతుకమ్మను పేర్చుతారు. టేకు పూలు, గునుగుపూలు ఆకర్షణీయంగా కన్పించేందుకు రంగులు అద్దుతారు.

■ వినాయకచవితి తర్వాత రోజు నుంచే...



బతుకమ్మ పేర్చుతున్న కుసుమాంబ

సుజాతనగర్: నా చిన్నతనంలో బతుకమ్మను వినాయకచవితి తర్వాత రోజు నుంచే ప్రారంభించేవాళ్లం. పున్నమి నుంచి అమావాస్య వరకు ఆడపిల్లలం అందరం కలిసి బొడ్డెమ్మ ఆడేవాళ్లం. తర్వాత పెత్ర అమావాస్య రోజు బతుకమ్మలు పెట్టి ఏడు రోజులు ఆడేవాళ్లం. ఎనిమిదో రోజు బతుకమ్మకు విశ్రాంతి నిచ్చేవాళ్లం. తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మను పేర్చేవాళ్లం. సద్దుల బతుకమ్మ రోజు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ..పాటలు పాడి ఊరి చెరువులో బతుకమ్మలను సాగనంపేవాళ్లం. చెరువు కట్టపైనే కూర్చొని ఊరిజనం చేసుకొచ్చిన సద్దులు తినేవాళ్లం. నేను 50 ఏళ్లుగా బతుకమ్మ ఆడుతున్నాను. ఇప్పటికీ పండుగ అంటే నాకు చాలా ఇష్టం. పండుగ మొదటి రోజు, చివరి రోజున తప్పకుండా ఉపవాసం ఉంటాను. గతంలో పాటలు పాడుకుంటూ పండుగ జరుపుకునేటోళ్లు. ఇప్పుడేమో సౌండ్ బాక్సుల్లో వచ్చే పాటల మధ్య వేడుక జరుపుతున్నారు.

– పెద్దమళ్ల కుసుమాంబ, సుజాతనగర్

సంస్కృతి, సంప్రదాయం..



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేదే బతుకమ్మ పండుగ. తెలంగాణ ప్రజలు ప్రకృతిలోని పూలను ఆరాధించే తత్వం కలవారు. వివిధ రకాల పువ్వులను దేవతా ప్రతిరూపాలుగా భావించి పూజలు చేస్తారు.

– చలువాది రాజ్యలక్ష్మి, గృహిణి

చిన్నతనం నుంచి ఆడుతున్నా..



బతుకమ్మ పండుగను చిన్నతనం నుంచి జరుపుకుంటున్నాం. ఎక్కడెక్కడో ఉండే మహిళలంతా ఈ తొమ్మిదిరోజులు ఒకచోట కలిసి బతుకమ్మలను ఆడుకుంటాం. ఆటపాటలతో ఆనందోత్సాహాలతో గడుపుతాం.

– కల్లూరి కృష్ణవేణి, మహిళా రైతు

ఇంటిల్లిపాదికి ఆనందమే..



బతుకమ్మ పండుగ అంటే ఇంటిల్లిపాదికి ఆనందమే. నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తోబుట్టువులు, స్నేహితులతో కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మలను ప్రతి సంవత్సరం జరుపుకుంటాం.

– కారం నాగరత్నం, కొత్తసూరారం

పూల కోసం శ్రమించేవాళ్లం



బతుకమ్మ పండుగ వచ్చిందంటే ఒక రోజు ముందే పూల కోసం అడవికి వెళ్లి తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి, తామర తదిరత పూలను సేకరిస్తాం. బతుకమ్మలను ఎంతో ఇష్టంగా పేర్చి గంటల కొద్దీ ఆడి వాగులు, చెరువుల్లో వదిలిపెడతాం.

–పెండ్యాల రోజాలక్ష్మి, వ్యాపారి

మార్పులొచ్చాయి



వివిధ రకాల పూలను సేకరించి నిండుగా బతుకమ్మలను పేర్చి గతంలో 17 రోజు బతుకమ్మలను ఆడేవాళ్లం. ఇప్పుడు కేవలం 9 రోజులు ఆడుతున్నారు. ప్రస్తుతం బతుకమ్మలకు పూలు కూడా అరకొరగానే లభిస్తున్నాయి. కొందరు ప్లాస్టిక్ పూలు వినియోగిస్తున్నారు.

– కనకదుర్గ, సీడీపీఓ

క్లుప్తంగా

వైభవంగా రుద్రహోమం


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని యాగశాలలో రుద్రహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో వేదమంత్రోచ్చరణ నడుమ స్వామివారిని అర్చకులు ఊరేగింపు తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజ, రుద్రహోమం జరిపి, చివరన పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


వాహనాన్ని చూపుతున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని పాపిడిగూడెం మార్గంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఏపీ వైపు వెళ్తున్న ఓ వాహనంలో తరలిస్తున్న 34 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఏపీలోని పిఠాపురానికి చెందిన ఆకుల రవి, శివచక్ర రాంబాబుతోపాటు ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన మొగిలిచర్ల సతీశ్ కలిసి సత్తుపల్లి మండలంలోని గంగారం పరిసరాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తేలింది. రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన ఏఎన్ఎం మృతి


సోడి కృష్ణవేణి (ఫైల్)

చర్ల: మండలంలోని కలివేరు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఏఎన్ఎం శుక్రవారం ఉదయం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన సోడి కృష్ణవేణి (36) సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాల పరిధి పెదమిడిసిలేరు ఆరోగ్య ఉప కేంద్రంలో సెకెండ్ ఏఎన్ఎంగా పనిచేస్తోంది. విధి నిర్వహణలో భాగంగా బుధవారం సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై పెదమిడిసిలేరుకు వెళ్తున్న సందర్భంలో కలివేరులో ఆటోను తప్పించే క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. వెనుక కూర్చున్న కృష్ణవేణి తలకు గాయాలయ్యాయి. ఆమెను సత్యనారాయణపురం వైద్యశాలకు అక్కడి నుంచి భద్రాచలం వైద్యశాలకు.. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్న క్రమంలో శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త వాసం కృష్ణతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

పాల్వంచ: అక్రమంగా నల్లబెల్లం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బి.రాము కథనం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం బీసీఎంరోడ్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. భద్రాచలం వైపు నుంచి కొత్తగూడెం వైపు వస్తున్న తవేరా వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపారు. డ్రైవర్ వెంటనే పరారయ్యాడు. వాహనంలోని 15 క్వింటాళ్ల నల్లబెల్లం గుర్తించి సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బి.రాము తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సుజాతనగర్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై సుజాతనగర్ ఠాణాలో శుక్రవారం కేసు నమోదైంది. ఖమ్మం జిల్లాలోని ఓ మండలానికి చెందిన యువతి స్థానిక కళాశాలలో చదువుతూ ఇక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 11న తన తాతయ్య చనిపోయాడని వార్డెన్‌కు చెప్పి హాస్టల్ నుంచి వెళ్లింది. తిరిగి హాస్టల్‌కు రాకపోయేసరికి సదరు వార్డెన్ యువతి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. తమ కూతురు అసలు ఇంటికే రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

కుదరని సయోధ్య!


మున్సిపల్ చైర్మన్ డీవీతో చర్చిస్తున్న మంత్రి సత్యవతి, ఎంపీలు మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర

- ఇల్లెందు బీఆర్ఎస్‌లో ఆరని అసమ్మతి చిచ్చు
- ఇరువర్గాలతో మంత్రి సత్యవతి, ఎంపీలు రవిచంద్ర, కవిత చర్చలు
- డీవీకి అధిక ప్రాధాన్యమిస్తున్నారని అసమ్మతి కౌన్సిలర్ల గుర్రు

ఇల్లెందు: ఇల్లెందు నియోజవర్గ బీఆర్ఎస్‌లో అసమ్మతి ఎటూ చల్లారడం లేదు. పార్టీ పెద్దలు సర్దిచెబుతున్నా, బుజ్జగిస్తున్నా అసంతృప్తులు శాంతించడంలేదు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పులిగళ్ల మాధవరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మూల మధుకర్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, మూడు కృష్ణప్రసాద్‌లు ఎమ్మెల్యే హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని పట్టుబడుతున్నారు. ఇక మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వ్యతిరేకంగా అసమ్మతి నడుపుతున్నారు. కొంతకాలంగా ఈ వ్యవహారం సాగుతూనే ఉంది. కాగా గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ వద్ద అసమ్మతి నాయకులు తమ గోడు వెళ్లబోసుకోగా, ఆయన తగిన సూచనలు చేశారు. ఈ క్రమంలో అసమ్మతి సమసిపోయినట్లు సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర తొలుత మహబూబాబాద్‌లో అసమ్మతి నేతలతో చర్చలు సాగించారు. అనంతరం అస్మమతి నాయకులు వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లిపోయారు. ఇక మంత్రి, ఎంపీలు ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని తొలుత సీఎం సభలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియను తీసుకుని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు గృహానికి వెళ్లారు. ఆయనతో చర్చించి వెంట తోడ్కొని క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే పడిగాపులు కాస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు డీవీ రాకను చూసి క్యాంపు కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. డీవీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వటాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా గృహంలో సమావేశమయ్యారు. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇరువర్గాలతో పార్టీ పెద్దలు చర్చలు జరపడమే సరిపోయింది. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయింది.


ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి వెళ్లిపోయి వైస్ చైర్మన్ జానీపాషా ఇంట్లో సమావేశమైన డీవీ వ్యతిరేక వర్గం కౌన్సిలర్లు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

గుండాల: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు చెట్టుపల్లి, శంభునిగూడెం, దామరతోగు, సాయనపల్లి పోలింగ్ స్టేషన్లను సందర్శించి మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలో ర్యాంపులు, కరెంటు, టాయిలెట్స్ , మంచినీరు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలలు ఎన్నికల నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని సీఐ రవీందర్‌ను సూచించారు. ర్యాలీలు, సభలకు అనుమతి తీసుకోవాలని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లోపు ఎటువంటి మైక్, లౌడ్‌స్పీకర్లు వినియోగించొద్దని సూచించారు. ఇతర పార్టీల ఎన్నికల ప్రచారానికి ఆటంకం కలిగించొద్దన్నారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, తహసీల్దార్ రంగా, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వలీ, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సుజాతనగర్: సుజాతనగర్, నాయకులగూడెం, వేపలగడ్డ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను కొత్తగూడెం ఆర్డీఓ ఆర్.శిరీష శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సౌకర్యం , ఫర్నిచర్, ర్యాంపులు, విద్యుత్ తదితర వసతులను కల్పించాలన్నారు. బీఎల్ఓల వద్ద ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించిన అనంతరం 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ జి.శిరీష, ఆర్ఐ ఎం.కాంతారావు, బీఎల్ఓలు మాధవి, కళావతి, సరస్వతి పాల్గొన్నారు.


గుండాల పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

జెడ్పీ సీఈఓ పరిశీలన

పాల్వంచరూరల్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున్న రాజకీయ వాల్‌పోసర్లు, బ్యానర్లు తొలగించాలని, నాయకుల విగ్రహాలకు పూర్తిస్థాయిలో ముసుగులు వేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత ఆదేశించారు. మండల పరిధిలోని సూరారం, పాండురంగాపురం, పాండురంగాపురంతండా, ఇల్లెందులపాడుతండా గ్రామపంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంపీడీఓ బి.అప్పారావు, సిబ్బంది ప్రభాకర్, మంగ, కాళి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

కరకగూడెం: భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ శుక్రవారం కరకగూడెం మండలంలో పర్యటించారు. పద్మాపురం, సమత్‌మోతె, రేగళ్ల, అనంతారరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కరకగూడెం - చిరుమళ్ల గ్రామాల మధ్య పెద్దవాగుపై కొట్టుకుపోయిన వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ,తహసీల్దార్ నరేశ్, ఏడూళ్లబయ్యారం సీఐ శివకుమార్, ఎస్‌ఐ రాజారామ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

37మంది బైండోవర్

ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన నగరానికి చెందిన రౌడీషీటర్లు, అనుమానితులతో పాటు బెల్టు షాపుల నిర్వాహకులను పోలీసులు బైండోవర్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం 37మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఖమ్మం వన్ టౌన్ పరిధిలో 14మంది, టూ టౌన్ పరిధిలో 11, త్రీ టౌన్ పరిధిలో 12మందిని అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

పలు చోట్ల నగదు స్వాధీనం

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ పోలీస్ చెక్ పోస్టు వద్ద జూలూరుపాడు పోలీసులు శుక్రవారం నగదు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన కమ్మపాటి ప్రసన్న ట్రాలీ ఆటోలో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ప్రసన్న వద్ద రూ.2,08,190 ఉండగా సరైనా ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పినపాక మండలంలో..

పినపాక: మండలంలోని ఈ–బయ్యారం క్రాస్ రోడ్డులో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి రశీదులు లేని రూ.లక్ష నగదును శుక్రవారం సీజ్ చేశారు. సీఐ కథనం ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన పసల గణపతి, కారం కుమారి బైక్‌పై ఏడూళ్ల బయ్యారం నుంచి నగదు తీసుకెళ్తున్నారు. పోలీసులు నగదును, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లయింగ్ సిబ్బందికి అందజేశారు.


పినపాక: నగదు తీసుకెళ్తున్న వారితో సీఐ శివప్రసాద్

నాటుసారా పట్టివేత


నాటుసారాను చూపుతున్న ఎస్‌ఐ శ్రీకాంత్


నిందితుడితో ఎస్‌ఐ, సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరు వద్దగల చెక్‌పోస్టు దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు వైపు నుంచి వస్తున్న అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఎనుముల వెంకట్రావు, ఒంటిపెల్లి అలివేలు పోలీసులను పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకోగా వారి వద్ద రెండు క్యాన్లలో సుమారు 10 లీటర్ల నాటుసారా లభించింది. వెంటనే నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి నుంచి చంద్రుతండా మధ్య రహదారిలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారు చేసి చంద్రుతండా నుంచి శంభునిగూడెంనకు సరఫరా చేస్తున్న గుగులోత్ రాజాను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద ఉన్న 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

8 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులను చూపుతున్న పోలీసులు

భద్రాచలంటౌన్: ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంగజ్ ఆదేశాల మేరకు పట్టణ ఎస్‌ఐ మధుప్రసాద్ ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా వారి వద్ద 8 కిలోల గంజాయి లభించింది. ఖమ్మంకు చెందిన గురిందపల్లి దీపక్, కొట్టే హరీశ్ ఒడిశా సరిహద్దులోని డొంకరాయి పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మం తరలిస్తున్నారని, సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన దివాకర్ తన ద్విచక్రవాహం ఇచ్చి ప్రోత్సహించారని సీఐ తెలిపారు. ద్విచక్రవాహనం, నిందితుల మొబైళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.35 లక్షలు ఉంటుందని సీఐ వివరించారు.

వాగులో పడి బాలుడు మృతి


యశ్వంత్ మృతదేహం

మణుగూరుటౌన్: చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి వాగులోపడి బాలుడు మృతి చెందిన ఘటన మణుగూరులో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న సరెడ్డి యశ్వంత్ (12) తన స్నేహితుడు ప్రీతమ్‌తో కలిసి సమితిసింగారం వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఇద్దరు వాగులోకి దిగగా లోతును అంచనా వేయక యశ్వంత్, ప్రీతమ్ మునిగిపోగా స్థానికులు వారిని గుర్తించి వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. యశ్వంత్ అప్పటికే మృతి చెందగా, అపస్మారక స్థితిలో ఉన్న ప్రీతమ్‌కు చికిత్స అందిస్తున్నారు. మృతుడి తండ్రి లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా, తల్లి లేదు. నాయనమ్మ సుభద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి

కామేపల్లి: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో షాక్ గురై మృతి చెందాడు. కామేపల్లి మండలం బాసిత్‌నగర్ సమీపంలోని నిమ్మవాగు వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం పుఠానితండా గ్రామానికి చెందిన రైతు గుగులోత్ అనిల్(31) బాసిత్‌నగర్‌లో ఓ రైతు భూమిని కౌలుకు తీసుకొని మిరప సాగు చేశాడు. రోజులాగే చేనుకు వచ్చిన ఆయన మధ్యాహ్నం మరో రైతు బానోత్ బావ్‌సింగ్‌తో కలిసి సమీపంలోని నిమ్మ వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టే క్రమంలో అనిల్‌కు తీగలు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడ్డున ఉన్న బావ్‌సింగ్ తీగలు తొలగించి అనిల్‌ను బయటకు తీసే సరికి మృతి చెందడంతో భయపడి పారిపోయారు. సమీప రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అనిల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

కారేపల్లి: అనారోగ్య సమస్యలతో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కామేపల్లి మండలం లావుడ్యాతండా గ్రామానికి చెందిన లావుడ్యా శివ(52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన శుక్రవారం ఇంట్లోనే పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఇల్లెందు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ఈమేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

జిల్లా వాలీబాల్, యోగా జట్ల ఎంపిక


వాలీబాల్ జట్టుతో డీఈఓ శర్మ, పీడీలు, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్–17 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, యోగా జట్లను ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన వాలీబాల్ పోటీలకు బాలురు 136, బాలికలు 82 మంది హాజరుకాగా, యోగా పోటీల్లో 31 మంది పాల్గొన్నారు. సీనియర్ పీడీలు నర్సింహారావు, సుబ్రహ్మణ్యం, బాలరాజు, పీఈటీలు కవిత, హర్షిత, కృష్ణ, రాము, సైదేశ్వరరావు, వీరరాఘవయ్య ఆధ్వర్యాన వాలీబాల్ పోటీలు, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్ ఆధ్వర్యాన యోగా పోటీలు నిర్వహించారు. జట్ల వివరాలను జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, డీఈఓ సోమశేఖరశర్మ వెల్లడించగా బి.గోవిందరెడ్డి, ఉస్మాన్, ఎండీ అక్బర్‌అలీ పాల్గొన్నారు. కాగా, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యాన సుధాకర్, రామారావు, బండి సుధాకర్ క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేశారు. వాలీబాల్ బాలబాలికల జట్లకు ఎంపికై న వారిలో పి.సాయికృష్ణ, పి.విక్రమ్, ఎం .దినేశ్, వి.నందు, ఆర్.వెంకటేశ్వరరావు, ఈ.శ్రీనాథ్, ఎస్.శివకాశి, వై.చరణ్‌తేజ, డి.సాయిరాం, డి.వేణు, పి.వరుణ్‌తేజ, ఎస్. అక్షయ్‌కుమార్, బి.అంబేడ్కర్, ఈ.సుమిత్రనందన్, కె.ప్రసన్నకుమారి, డి.శుభాంగి, వి.లావణ్య, జి.నవ్యశ్రీ, పి.కీర్తన, బి.గాయత్రి, కె.నందిని, బి.సౌమ్య, పి.అనూష, జి.పూజిత ఉన్నారు.

‘మేరీ మిట్టి’లో భాగస్వాములు కావాలి


డీన్‌కు మట్టిని అందిస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మేరి మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం విద్యార్థులంతా కలిసి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారిని స్మరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా అమృత కలశ యాత్ర పేరుతో మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం దగ్గర అమరవీరుల గౌరవార్థం స్తూపాన్ని నిర్మిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు గోపాలకృష్ణమూర్తి, కృష్ణతేజ, శిరీష, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అడ్డుగా ఉందని..

- కిన్నెరసాని చెక్‌డ్యామ్ కరకట్టకు గండి కొట్టిన అక్రమార్కులు
- పరిశీలించి పూడ్చివేసిన అధికారులు


గండికొట్టిన చెక్ డ్యామ్ కరకట్టను పరిశీలిస్తున్న ఆర్ఐ, జేఈ

పాల్వంచరూరల్: అక్రమార్కులకు ఇసుక కాసులు కురిపిస్తోంది. రవాణాకు అడ్డంగా ఉంటే చివరకు చెక్ డ్యామ్‌లకు కూడా గండి కొడుతున్నారు. ఇలాంటి సంఘటనే పాల్వంచ మండలం రంగాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. రంగాపురం వద్ద కిన్నెరసాని నదిలో రూ. కోట్ల వ్యయంతో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టారు. ఇక్కడి ఇసుక తరలించేందుకు ఏకంగా కరకట్టకే గండికొట్టారు. దారి ఏర్పాటు చేసుకుని నేరుగా జాతీయ రహదారిపైకి చేరుకుని యథేచ్ఛగా లారీలు, ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. రూ. లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం సమాచారం అందుకున్న తహసీల్దార్ నాగరాజు, జలవనరులశాఖ ఈఈ అర్జున్‌ల ఆదేశాలతో ఆర్ఐ హచ్యా, జేఈ మంగు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కరకట్టకు పెద్ద గండి కొట్టి నదిలోకి వాహనాలు వెళ్లేలా దారి ఏర్పాటు చేసుకుని ఉండగా, అధికారులు జేసీబీ సహాయంతో గండిని పూడ్చివేశారు. పబ్లిక్ ప్రాపర్టీని ధ్వంసం చేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేశామని జలవనరులశాఖ జేఈ తెలిపారు.

జూలూరుపాడులో మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

జూలూరుపాడు: పాపకొల్లు బీట్ చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఒక ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేయగా, మరో రెండు ట్రాక్టర్లు లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉండటంతో పట్టుకుని ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. ఈ విషయంపై జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావును వివరణ కోరగా.. రాంపురంతండా, ఎలుకలొడ్డు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు బానోత్ బాబూలాల్, మడి సీతరాములు, బచ్చల ఈశ్వర్‌లపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది వి.మలయ్య, బి. నరసింహారావు, చింతా వెంకటేశ్వర్లు, డి కిషన్, రహీం పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికుడి పర్సు మాయం

పాల్వంచ: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి పర్సు చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సోములగూడెంనకు చెందిన గంగిశెట్టి వెంకయ్య శుక్రవారం కొత్తగూడెం వైపు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ఆయన తన బ్యాగు కింద పెట్టి కూర్చోగా కొంతదూరం వెళ్లాక బ్యాగ్ సరిచూసుకోగా అందులోని పర్సు పోయినట్లు గుర్తించాడు. బ్యాగ్‌లో రూ.22 వేల నగదు, పలు గుర్తింపు కార్డులు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీట్‌-యూజీ సిలబస్‌ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్‌ కట్‌...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్‌: ఎంబీబీఎస్, బీడీఎస్‌ వంటి మెడికల్‌ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్‌ ఎలిజిబిలిటీ కమ్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ (నీట్‌) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్‌ కమిషన్‌ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్‌ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్‌ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్‌ తగ్గించలేదు, కానీ సబ్‌ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్‌ టాపిక్స్‌ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్‌ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్‌ యూజీ సిలబస్‌ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్‌ విద్యార్థుల కన్నా, ఫస్టియర్‌ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్‌ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్‌:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్‌ బ్లాక్‌ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్‌ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్‌:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్‌ ఫస్టియర్‌:** ప్యూర్‌ రోలింగ్, కనెక్టింగ్‌ బాడీలు, పాలిట్రోపిక్‌ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్‌ సెకండియర్‌:** పొటెన్షియల్, నాన్‌ పొటెన్షియల్‌ సంభావ్యత, ప్రొటెన్షియోమీటర్, ఎర్త్‌ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్‌–2: వానపాములు, యూనిట్‌–5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్‌–10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్‌: ప్లాంట్‌ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్‌ ఇన్‌ ప్లాంట్స్, మినరల్‌ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్‌: స్ట్రాటజీస్‌ ఫర్‌ ఎన్‌హ్యాన్స్‌మెంట్‌ ఇన్‌ ఫుడ్‌ ప్రొడక్షన్‌.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్టేస్, లెగుమనీస్‌ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

"సిలబస్‌ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్‌ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే. – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ"

● బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్‌ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్‌

- పాత కేసులో రాజస్తాన్‌ పోలీసుల లుక్‌అవుట్‌ నోటీస్‌
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్‌: రాజస్తాన్‌ పోలీసుల లుక్‌ఔట్‌ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్‌ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్‌ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్‌ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్‌ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్‌ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్‌ మెట్రోపాలిటన్‌ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్‌ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన 'ఊపిరి' నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్‌
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్‌: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్‌ లంగ్స్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్‌ గోరుకంటి పవన్, సీనియర్‌ ఇంటర్వెన్షనల్‌ పల్మనాలజిస్టు డాక్టర్‌ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్‌ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్‌ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్‌ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్‌ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్‌ వెంటిలేటర్స్‌ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్‌ చొరవతో ఇంటర్వెన్షనల్‌ పల్మనాలజిస్టు డాక్టర్‌ హరికిషన్, థొరాసిక్‌ లంగ్‌ ట్రాన్స్‌ప్లాంట్‌ సర్జన్‌ డాక్టర్‌ కేఆర్‌ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్‌ మంజునాథ్‌ బాలే, డాక్టర్‌ చేతన్, డాక్టర్‌ శ్రీచరణ్, డాక్టర్‌ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్‌ పలివాల్‌ వినూత్న కృషి..షార్ట్‌ ఫిల్మ్‌ను షేర్‌ చేసిన ఎంపీ సంతోష్‌ కుమార్‌

సాక్షి, హైదరాబాద్‌: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్‌ సుందర్‌ పలివాల్‌ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్‌ కుమార్‌ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్‌ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్‌ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్‌ ఆఫ్‌ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్‌ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్‌ పలివాల్‌ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్‌ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్‌ ఫిల్మ్‌ను ఎక్స్‌(ట్విట్టర్‌)లో సంతోష్‌ కుమార్‌ షేర్‌ చేస్తూ పలివాల్‌ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు 'సుద్దాల' పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ రాధారాణి. చిత్రంలో ఆర్‌.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్‌ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్‌): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్‌ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్‌.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్‌ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, 'మోదుగుపూలు' ఎడిటర్‌ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

జిల్లా వార్తలు

క్షేత్రస్థాయి సందర్శనలో విద్యార్థులు



విద్యార్థినులకు సాగు విధానాలను వివరిస్తున్న రైతు

దమ్మపేట: అశ్వారావుపేటలోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ అగ్రికల్చర్‌ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. దమ్మపేట మండలం మల్కారం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు అంకత మహేశ్వరరావు ఆయిల్‌పామ్‌ పామాయిల్‌ క్షేత్రానికి వచ్చిన వారు ఆయిల్‌పామ్‌తో పాటు అంతర్‌ పంటగా సాగు చేస్తున్న కోకో సాగు విధానాలను తెలుసుకున్నారు. అలాగే, వర్మీ కంపోస్ట్‌ తయారీ, కోళ్ల పెంపకంపై రైతు వివరించారు. కార్యక్రమంలో పావని, నీలిమ, రమేశ్, కృష్ణ తేజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సరైన సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్నపురెడ్డిపల్లి: పంటను ప్రస్తుతం తెగుళ్ల ఆశిస్తుండటంతో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. మండలంలోని మర్రిగూడెం, అన్నపురెడ్డిపల్లి గ్రామాల్లో ఉద్యాన శాస్త్రవేత్త శివ, ఏడీఏ లాల్‌చంద్‌తో కలిసి శుక్రవారం ఆమె వరి, పత్తి, మిరప పంటలను పరిశీలించారు. వరిలో కంకినల్లి, పాముపొడ తెగులు, అగ్గి తెగులు సోకినట్లు గమనించి నివారణకు లీటర్‌ నీటిలో 5 ఎంఎల్‌ డైకోఫాల్, ట్రైసైక్లోజోల్‌ 120 జీఎం ఎకరానికి వాడాలని సూచించారు. అలాగే, పత్తిలో రసం పీల్చుపురుగు, పేనుబంక, తెల్లదోమ నివారణకు ఎస్పేట్‌ పిచికారీ చేయాలన్నారు. మిర్చిలో పసుపురంగు, నీలం రంగు జిగురు అట్టలను ఎకరానికి 50 నుంచి 100 వరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంటలో కలుపు పెరిగితే తెగుళ్ల ఉధృతి ఉంటుందని.. అందువల్ల ఎప్పటికప్పుడు కలుపు తొలగించాలని సూచించారు. అలాగే, పంట మొదటి, రెండు విడతల్లో వేపనూనె 1,500 పీపీఎం పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నవీన్, ఏఈఓ అనూష, ఏఈఓ ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయాలి

- భద్రాద్రిలో రేపటి నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- వివరాలు వెల్లడించిన ఈఓ రమాదేవి



మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు, శబరి స్మృతి యాత్ర, ముక్కోటి ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఈఓ ఎల్‌.రమాదేవి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, స్థానాచార్యులు కేతఃస్థలశాయి కోరారు. ఉత్సవాలకు సంబంధించిన వివరాలను శుక్రవారం చిత్రకూట మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. దసరా సందర్భంగా 15వ తేదీ నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనం, చిత్రకూట మండపంలో సంక్షేప రామాయణ హవనం ఉంటాయని, వీటిలో భక్తులు పాల్గొనవచ్చని చెప్పారు. అలాగే, రామాలయంలో నిత్యం శ్రీరామస్మరణ, ఇతర భక్తి కార్యక్రమాలు నిర్వహించే భక్తులకు ఉచిత గది, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు.

28న పాక్షిక చంద్రగ్రహణం

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 23 వరకు అమ్మవారి అలంకరణలు, 24న శ్రీరామ లీలా మహోత్సవం, శమీ పూజ, విజయోత్సవాలను ఎప్పటి మాదిరిగానే ఘనంగా జరుపుతామని ఈఓ రమాదేవి వెల్లడించారు. అలాగే, 28వ తేదీన అశ్వయుజ శుద్ధ పూర్ణిమ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శబరి స్మృతి యాత్రకు గిరిజనులు పెద్దసంఖ్యలో వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అదేరోజు పాక్షిక చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం ఆలయ తలుపులు మూసి, తెల్లవారుజామున 4 గంటలకు తెరిచి సంప్రోక్షణ చేసిన అనంతరం దర్శనాలకు అనుమతిస్తామని తెలిపారు. ఇక డిసెంబర్‌ 13 నుంచి జనవరి 2వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు, డిసెంబర్‌ 22న తెప్పోత్సవం, 23న తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం ఉంటాయని, ఈ పనులకు సంబంధించి టెండర్‌ ప్రక్రియ నడుస్తోందని చెప్పారు. భక్తులకు నూతన సేవలతో పాటుగా ఆర్జిత సేవలు, గదుల బుకింగ్‌కు ఆన్‌లైన్‌ సౌకర్యం అందుబాటులోకి తీసుకురాగా, రామయ్యకు చెందిన భూములను స్వాధీనం చేసుకునే దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

బీజేపీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్‌ సునీల్‌



మాట్లాడుతున్న సునీల్‌ దియోదర్‌

ఖమ్మంరూరల్‌: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. డబుల్‌ ఇంజన్‌ సర్కార్‌ వస్తేనే అభివృద్ధి సాధ్యమనే అభిప్రాయం అందరిలో ఉందని బీజేపీ ఖమ్మం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్‌ సునీల్‌ దియోదర్‌ తెలిపారు. ఖమ్మం రూరల్‌ మండలం ఏదులాపురం క్రాస్‌లోని ఫంక్షన్‌ హాల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం.. అంతా వారే చేస్తున్నట్లు చెప్పుకుంటోందని విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే సూర్యాపేట – కురవి, నాగ్‌పూర్‌ – అమరావతి జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు దియోదర్‌ తెలిపారు. బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకార్యకర్తలు కష్టపడి పనిచేసి రాష్ట్రంలో అధికారం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు నాయకులు త్రిలోకేశ్వర్, తక్కెళ్లపల్లి నరేందర్, నున్నా రవికుమార్, నూకల రాంమోహన్‌రెడ్డి, శ్యాంరాథోడ్, దేవకి వాసుదేవ్, మేక సంతోష్‌ రెడ్డి, వీరెల్లి లక్ష్మయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ చెప్పేదొకటి.. చేసేదొకటి

- వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీని నిలదీయండి
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చెప్పేదొకటైతే.. చేసేది ఇంకో రకంగా ఉంటోందని, ఆ పార్టీ నేతలు ఇప్పటివరకు చెప్పిన పని ఏది కూడా చేయలేదని సీపీఐ (ఎంఎల్‌) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పోడు సాగుదారులందరికీ పట్టాలిస్తామని చెప్పినా నెరవేర్చలేదని తెలిపారు. ఇక ఇచ్చిన వారికి కూడా ఎకరా నుంచి రెండు, మూడు ఎకరాలకే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. మాజీ మంత్రి గ్రామమైన గండుగలపల్లి, ఎల్లన్ననగర్, గుడిపాడు ప్రాంతాల్లో హక్కుపత్రాలు అసలే ఇవ్వకపోగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్‌ జిల్లాల్లో పోడు పట్టాలు సక్రమంగా పంపిణీ చేయలేదన్నారు. పోడు సాగుదారులపై కేసులు ఎత్తివేయాలని తాము డిమాండ్‌ చేస్తే కేవలం హక్కు పత్రాలు పొందిన వారిపైనే కేసులు ఉపసంహరించుకుంటున్నట్లు అధికారులు చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఇకనైనా పోడు సాగుదారులందరిపై కేసులను ఉపసంహరించాలని రంగారావు డిమాండ్‌ చేశారు. అలాగే, అన్ని ప్రాంతాల్లో పోడు సర్వే చేపట్టి రాజకీయాలకు అతీతంగా పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నాయకులను నిలదీయాలని రంగారావు పిలుపునిచ్చారు. కాగా, జన్మభూమి కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మద్దతుగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు సభలు నిర్వహించాలని కోరారు. ఇక వచ్చే ఎన్నికల్లో ప్రజాపంథా పోటీ చేస్తుందని, వామపక్షాలు ఐక్యంగా పోటీ చేసేలా చర్చలు జరుపుతామని తెలిపారు. పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు పనుల ప్రారంభానికి సమయం ఇవ్వడమే కాక పని ప్రారంభించిన వెంటనే నగదు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, సీవై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలలు కనండి.. వాటిని సాధించండి

- భద్రాద్రి కలెక్టర్‌ డాక్టర్‌ ప్రియాంక అల
- ప్రారంభమైన గురుకులాల జోనల్‌ స్పోర్ట్స్‌



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్‌ ప్రియాంక, అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ములకలపల్లి: పిల్లలకు చదువే సర్వస్వం కావాలని, విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చనే విషయాన్ని అందరూ గ్రహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ ప్రియాంక అల తెలిపారు. గురుకులాల 9వ లెవెల్‌ స్పోర్ట్స్‌ మీట్‌ ములకలపల్లి టీఆఎస్‌ డబ్ల్యూఆర్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన 1,200 మంది విద్యార్థినులు పోటీలకు హాజరుకాగా.. కలెక్టర్‌ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ సునీత అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్‌ ప్రియాంక మాట్లాడుతూ.. ఆడపిల్లలను చదువుకు దూరం చేయొద్దని పిలుపునిచ్చారు. అలాగే, విద్యార్థినులు కలలు కనడమే కాక వాటిని సాధించేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలని సూచించారు. తమ కుటుంబంలోనూ ఇద్దరు ఆడపిల్లలు ఉన్నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఐఏఎస్‌ సాధించానని తెలిపారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా అంకితభావంతో కష్టపడాలని, తద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. కాగా, గురుకులాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తుండటం అభినందనీయని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, డీఐఈఓ సులోచనారాణి, గురుకులాల జిల్లా అధికారి సక్రునాయక్, తహసీల్దార్‌ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంఈఓ శ్రీరామ్మూర్తితో పాటు కరుణామయి, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, గఫూర్‌ పాషా, కరుణామయి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ విద్యార్థులు సత్తా చాటాలి

జోనల్‌ స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించిన ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌

గుండాల: ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు క్రీడాపోటీల్లో సత్తా చాటాలని.. తద్వారా భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌ జైన్‌ తెలిపారు. గుండాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ ఏజో జోనల్‌స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి జాతీయ, క్రీడా, గురుకుల జెండాలను ఎగురవేశాక క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పీఓ ప్రతీక్‌జైన్‌ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు సహజంగా క్రీడల్లో నైపుణ్యం కలిగి ఉంటారని, ఈ నైపుణ్యంతోనే పోటీల్లో ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అండర్‌–14, 17, 19 విభాగాల్లో ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని తద్వారా స్నేహభావం పెరగడమే కాక శారీరక దృఢత్వం దరి చేరుతుందని పీఓ వివరించారు. కాగా, మూడు రోజులపాటు జరిగే పోటీల్లో ఇబ్బంది ఎదురుకాకుండా భోజన, వసతి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి వాలీబాల్‌ ఆడారు. ఈ పోటీలకు ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని 18 పాఠశాలలు, కళాశాలల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్‌ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, తహసీల్దార్‌ రంగా, ఎంపీడీఓ సత్యనారాయణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ హరికృష్ణతో పాటు సత్యనారాయణ, మనీశ్‌రెడ్డి, జానూనాయక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్‌ సర్వీస్‌ చేస్తున్న పీఓ